క్లుప్తంగా

యువత గంజాయికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ జగన్

నడిగూడెం : యువత గంజాయికి దూరంగా ఉండాలని స్థానిక ఏఎస్‌ఐ జగన్ అన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో డ్రగ్స్ నిషేధం, సైబర్ నేరాలు, షీ టీమ్, మహిళల భద్రత, 100 కాల్, సోషల్ మీడియా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కె.షరీఫ్, సూర్యాపేట షీ టీమ్ ఏఎస్‌ఐ పాండునాయక్, షీ టీమ్ మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి, కళాజాతా బృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాట్ ర్యాంకర్‌కు అభినందనలు



వి.కౌశిక

హుజూర్‌నగర్ : దేశవ్యాప్తంగా నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)లో హుజూర్‌నగర్‌కు చెందిన ఉప్పల కౌశిక 99.87 పర్సంటేజ్ సాధించినట్లు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, విద్యార్థి తండ్రి ఉప్పల గోపాల కృష్ణమూర్తి శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలు శనివారం వెలువడినట్లు చెప్పారు. చదువులో దేశ స్థాయిలో అత్యున్నత ప్రతిభను కనపరిచి, హుజూర్‌నగర్ ప్రాంతానికి పేరు తీసుకొచ్చిందని కౌశికను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎస్.సత్యనారాయణ, ఎ.శ్రీనివాసరెడ్డి, చల్లా కృష్ణయ్య, రవికుమార్, యాదగిరి, రమణారెడ్డి, తదితరులు అభినందించారు.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



మండల అధ్యక్ష, కార్యదర్శి

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గరిడేపల్లి మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రణబోతు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎలక సైదిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగార్జున, రామలింగాచారి, వెన్న శైలజ, కోశాధికారిగా భూసా వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రణబోతు రవీందర్, వెంకటేశ్వర్లు, బాలసాదిరెడ్డి రాంబాబు, రిటైర్డు ఉపాధ్యాయులు రామస్వామి, వెంకటేశ్వర్లు, సంఘం కార్యకర్తలు సైదులు, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, రవీందర్‌నాయక్, బాలు, వీరస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి వెండి జంధ్యం బహూకరణ



వెండి జంధ్యం అందజేస్తున్న దుర్గారావు దంపతులు

నడిగూడెం : మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలోని స్వామివారికి శనివారం నడిగూడెంకు చెందిన కొండ దుర్గారావు దంపతులు రూ.10 వేల విలువైన వెండి జంధ్యంను బహూకరించారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయ ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ, తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

మోతె : మండల పరిధిలోని అప్పన్నగూడెంలో మాజీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు ఐదు లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ పెద్దలు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ పందిళ్ల పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తండు సంజీవ్‌గౌడ్, వెంకటరెడ్డి, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని శ్రీగుంటి రఘునాథస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వార గుండా భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య, ధర్మకర్త వేనేపల్లి శ్రీనివాసావు, మాజీ సర్పంచ్ పయిడిమర్రి సత్యబాబు, కోటేశ్వరరావు, ఆలయ అర్చకులు రాఘవాచార్యులు, లక్ష్మణాచార్యులు, ఉపేంద్రచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో..

పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో వేంచేసియున్న శ్రీ రామచంద్రుడు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వార ముఖంగా భక్తులకు దర్శించుకునేందుకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామయ్య, గాయిత్రి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మునగాల : తెలంగాణలో ఉత్తర ముఖద్వారం కలిగిన మండలంలోని బరాఖత్‌గూడెం శ్రీస్వయంభు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు ఉత్తర ముఖ ద్వారం గుండా దర్శించుకున్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి దాదాపు పదివేల మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని పుర వీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఆలయ పూజారి కందాళ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. కాగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. మునగాల పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొంతు పుష్పావతి, సర్పంచ్ కొప్పుల ఈరమ్మ, ఈఓ చలపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపాల గ్రామంలో..

మండలంలోని రేపాలలో గల శ్రీస్వయంభు లక్ష్మీనరసింహస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ఉత్తర ముఖద్వారం గుండా భక్తులు దర్శించుకున్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయం, రామాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఆలయ పూజారులు సిరికొండ అనంతకృష్ణామాచార్యులు, పృథ్వీ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని భక్తులు ఉత్తరముఖ ద్వారం నుంచి దర్శించుకున్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల రుక్మిణీసత్యభామ గోదా సమేత సంతానవేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కుంకుమార్చన, పగల్ పత్తు, తదితర పూజలు నిర్వహించారు. స్వామివారిని ఉత్తరద్వారం గుండా భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయని వెంకటేశ్వరరావు, భక్తులు ఉన్నారు.



కోదాడఅర్బన్ : రంగని గుడిలో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మునగాల : బరాఖత్‌గూడెంలో వేంకటేశ్వరస్వామిని ఉత్తరముఖ ద్వారం గుండా దర్శించుకుంటున్న భక్తులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, శ్రీవేంకటేశ్వమిస్వామి దేవాలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ గుజ్జుల కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల కలశం ఊరేగింపు

ఆయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన శ్రీరామ స్వర్ణ అక్షింతల కలశాన్ని మేళ్లచెరువులో కోలాటాలు, భజనలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, దిర్శించర్లలోని కోదండ రామాలయం, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు అన్నంబోట్ల ఫణికుమార్‌శర్మ, ఉపేంద్రాచార్యులు, తరుణ్‌చార్యులు, కోదండ రామాలయ చైర్మన్ తాళ్లూరి లక్ష్మీనారాయణ, శివాలయం చైర్మన్ చెన్నబోయిన నవీన్, సభ్యులు దేవరశెట్టి నాగేశ్వరరావు, యోగానందం, లక్ష్మి, నర్సింహరావు, జూలూరి అశోక్, వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షులు వీరవల్లి శ్రీలత, కోటేశ్వర్‌రావు భక్తులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : దిర్శించర్లలో..



హుజూర్‌నగర్‌రూరల్ : ఆర్డీఓ జగదీష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో గల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారా గుండా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు మండాది వెంకయ్య, నలజాల రామారావు, గురుస్వాములు రావుల ముత్యాలు, రాము, వీరయ్య, కృష్ణారెడ్డి, నాగరాజు, మట్టయ్య, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకోవడానికి భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూ లైన్‌లో నిల్చున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు సిరిపురం, రత్నవరం గ్రామాల్లోని శ్రీ కోదండరామస్వామి ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిపురంలో స్వామివారిని ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాల పూజారులు వేదాంతం చక్రధరాచార్యులు, వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోతె : మండల పరిధిలోని సిరిపురం గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆండాళ్ గోష్ఠి సభ్యులు గోపాల్‌రెడ్డి, యాట వెంకన్న, శ్రీను, శ్రీలక్ష్మి, బోళ్ల సరిత, బోడపట్ల సరిత, నూకల ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను బూరుగడ్డ, మాచవరంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ఆర్డీఓ జగదీష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆలయ చైర్మన్ గందు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, అర్చకులు మనోహరాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ, గోదా, రామానుజ అష్టోత్తరాలను పఠించి తిరుప్పావై సేవాకాలాన్ని శ్రావ్యంగా గానం చేశారు. సాయంత్రం గోదా, శ్రీకృష్ణ ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేసి దేవాలయ ప్రదక్షిణం గావించారు. ఆలయ అధికారులు, ధర్మకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



మునగాల : బరాఖత్‌గూడెంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



హుజూర్‌నగర్ : పూజల్లో పాల్గొన్న భక్తులు



కోదాడరూరల్ : పూజలో పాల్గొన్న చైర్మన్ వెంకటేశ్వరరావు, భక్తులు



మోతె : లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



నడిగూడెం : సిరిపురంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



మేళ్లచెరువు : స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



చిలుకూరు : చెన్నకేశవ ఆలయంలో..

ఘనంగా గాయత్రిమాత వ్రతం



వ్రతంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో శనివారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గాయత్రిమాత వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజలను పిడుగురాళ్లకు చెందిన విరాట్ విశ్వకర్మ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ అధ్యక్షుడు ఉద్దోజు సూర్యనారాయణచారి, కార్యదర్శి నమోజు వీరాచారి, క్రోసూరి బ్రహ్మయ్యచారి, ఆకారపు వెంకటేశ్వర్లు, విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్ శనివారం తెలిపారు. రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్ శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు చేయగా ఏపీలోని జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లికి చెందిన కంచుగంటి నర్సింహారావు, జగ్గయ్యపేటకు చెందిన మనుబోలు శ్రీను, మేళ్లచెరువు మండలం రేవూరుకు చెందిన నిమ్మ సైదులు, హుజూర్‌నగర్‌కు చెందిన కంపా శ్రీనివాసరావు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5వేల నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

నడిగూడెం : ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నడిగూడెం మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన పలువురు కూలీలు బృందావనపురం వద్ద వరి నాటు పనులు పూర్తి చేసుకొని స్వగ్రామం బయలుదేరారు. మార్గమధ్యలో నారాయణపురం క్రాస్ రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న నాగమ్మ, సుక్కమ్మలకు తీవ్ర , మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను రెండు 108 అంబులెన్స్‌లలో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాతీయ రైతు దినోత్సవం



అభ్యుదయ రైతు శేషకుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మీవీణ, తదితరులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు వాసికర్ల శేషకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ భిక్షపతి, ఏఈఓ వినోద్, గ్రామ పెద్దలు పసుపులేటి జనార్దన్, కాసాని వెంకటేశ్వర్లు, గుండ్లపల్లి బుచ్చిరాములు, సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.గోపి, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ్, పొంగులేటికి ఘన స్వాగతం



మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకట్రావ్



ఉత్తమ్, పొంగులేటిని గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు నాగన్న, మల్లికార్జున్

హుజూర్‌నగర్ : మంత్రులుగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి హుజూర్‌నగర్‌కు వచ్చిన రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు శనివారం ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంత్రులను జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సభలో మంత్రులను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న శాలువాలతో సత్కరించి దేవుళ్ల చిత్రపటాలను బహూకరించారు. అధికారులతో సమీక్ష, సభ అనంతరం మంత్రులు పట్టణంలో ఇటీవల మాతృవియోగం అయిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు అదెర్ల శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన తల్లి సీతారావమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్‌ను ఇంటి వద్ద పలువురు నాయకులు కలిసి శాలుశాలతో సన్మానించారు. పలువురు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు మంత్రి ఇంటి వద్ద కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఉత్తమ్ పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తొలుత యూత్ కాంగ్రెస్ నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ర్యాలీగా సభప్రాంగణానికి వచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌సుందర్

కోదాడఅర్బన్ : కోదాడ కోర్టు ఆవరణలో జిల్లా కలెక్టర్ నిధుల నుంచి మంజూరైన రూ. 10లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కోదాడ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, అడిషనల్ జడ్జి భవ్యశ్రీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. కాలయాపన లేకుండా నిర్దేశిత సమయంలో రోడ్డు పూర్తి చేయాలన్నారు. కోదాడ కోర్టుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, సాధు శరత్ బాబు, కార్యవర్గం, న్యాయవాదులు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జడ్జీలు శ్యాంసుందర్, భవ్యశ్రీ

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరాలి

నేరేడుచర్ల : మండలంలోని పుల్లంబండతండా గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ క్లబ్ ఎంజెఎఫ్ కట్టా శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేయించిన గేటును శనివారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 15 పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గేటు దాతను చల్లా ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి జి.రామస్వామి, జోన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సభ్యులు రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సైదమ్మ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు



కోదాడ : జయ పాఠశాలలో మేరీమాత, శాంటా క్లాజ్ వేషధారణలో విద్యార్థులు

కోదాడ : పట్టణంలోని తేజ టాలెంట్ స్కూల్, జయ పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు మేరీమాతా, శాంటా క్లాజ్ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఐడియల్ హైస్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ సముద్రాల రాజ్యలక్ష్మి, రమణకుమార్, వెంకట్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని న్యూవిజన్ స్కూల్, ఎస్ఆర్ఎమ్ పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ దుస్తులు ధరించి క్రీస్తు జననంపై నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కేశినేని శ్రీదేవి, డైరెక్టర్ కార్తీక్‌రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు క్రిస్మస్ దుస్తుల పంపిణీ

చిలుకూరు : మండల కేంద్రంలోని రావినారాయణరెడ్డి కాలనీలో గల చర్చిలో క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ కానుకగా ప్రభుత్వం నుంచి వచ్చిన దుస్తులను శనివారం ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు పంపిణీ చేశారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీ బెల్లంకొండ రమణనాగయ్య, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్ఐ మంజుల, చర్చి పాస్టర్లు ఏసుపాదం, రమేష్, అబ్రహం, సామేల్, రవి, క్రైస్తవులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం నుంచి మంజూరైన దుస్తులను క్రైస్తవులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాణాల కవిత, తహసీల్దార్ హేమామాలిని, వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేపూరి సుధీర్, బాణాల నాగరాజు, గుండు విజయరామారావు, పాస్టర్లు పాల్గొన్నారు.

అనంతగిరి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన 120 గిఫ్ట్ ప్యాక్‌లను (దుస్తులు) ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కొణతం ఉమ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, కొణతం శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరు : క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



అనంతగిరి : తహసీల్దార్ కార్యాలయంలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ